# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

**పత్రికా ప్రకటన** **తేది: 06-09-2016**

కొత్త జిల్లాల్లో పనిభారాన్ని బట్టి పరిపాలనా విభాగాలు ఉండాలని, దీనికి అనుగుణంగా అధికారుల సర్దుబాటు, కొత్త ఉద్యోగుల నియామకం జరగాలని ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు అన్నారు. జిల్లాల పునర్ వ్యవస్థీకరణ నేపథ్యంలో అధికార యంత్రాంగం కూర్పుపై ఎం.సి.ఆర్.హెచ్.ఆర్.డి.లో మంగళవారం సమీక్ష జరిగింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మ, డిజిపి అనురాగ్ శర్మ, సీనియర్ ఐఎఎస్ అధికారులు, సీనియర్ ఐపిఎస్ అధికారులు, జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు పాల్గొన్నారు. మంత్రులు జగదీష్ రెడ్డి, మహేందర్ రెడ్డి, హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడారు. దసరా నుంచి కొత్త జిల్లాలతో పాటు కొత్త రెవిన్యూ డివిజన్లు, కొత్త మండలాలు కూడా సమాంతరంగా ప్రారంభం కావాలని సిఎం కేసిఆర్ తెలిపారు. ముందుగా కొత్త మండలాలను నిర్ధారించాలని, తర్వాత రెవిన్యూ డివిజన్లను కూర్పు చేయాలని సిఎం సూచించారు. జిల్లాలు, డివిజన్లు, మండలాల్లో మొదటిరోజు నుంచే రెవిన్యూ, పోలీస్ శాఖలు పని ప్రారంభించాలని ఆదేశించారు. మిగతా శాఖల కార్యాలయాలు, అధికారుల నియామకం కూడా ఆ తర్వాత చేపట్టాలని వివరించారు. మూడు అంచెలలో పరిపాలనా విభాగాల ఏర్పాటు, అధికారుల నియామకం తదితర ప్రక్రియలను కలెక్టర్లు పర్యవేక్షించాలని చెప్పారు. మండలాల్లో రెవిన్యూ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేయాలన్నారు.

ఇప్పటికే విడుదల చేసిన డ్రాఫ్టు నోటిఫికేషన్ పై ప్రజల నుంచి వచ్చిన స్పందన, అధికారులు చేసిన కసరత్తుల ఆధారంగా అవసరమైన మార్పులు చేసి పునర్ వ్యవస్థీకరణకు తుది రూపం ఇవ్వాలని సిఎం చెప్పారు. ఓ

కుటుంబం ఇల్లు మారినప్పుడు ఉండేలాంటి సమస్యలే, కొత్త జిల్లాల ఏర్పాటు సందర్భంగా తలెత్తుతాయన్నారు. ప్రారంభదశలో ఎదురయ్యే సహజ సమస్యలను గుర్తించి, పరిష్కరించాలని చెప్పారు.

రాష్ట్ర వ్యాప్తంగా 75 మండలాల కోసం కొత్తగా డిమాండ్లు రాగా, వాటిలో ఇప్పటికే 45 మండలాలను నోటిఫై చేసినట్లు సిఎం చెప్పారు. మరో 30 మండలాల కోసం డిమాండ్లు వచ్చాయని, వాటి సాధ్యా సాధ్యాలపై వెంటనే నిర్ణయం జరగాలని చెప్పారు. కొత్తగా ప్రతిపాదించే మండల జనాభా 35 వేలకు పైగా ఉండాలనే నిబంధన పెట్టుకున్నామన్నారు. అటవీ ప్రాంతాలు, మారుమూల ప్రాంతాలు, చెంచులు నివసించే ప్రాంతాలకు సంబంధించి జనాభా విషయంలో సడలింపు ఇవ్వాలని సూచించారు. ఈ అంశాలను పరిగణలోకి తీసుకుని కొత్త మండలాల ఏర్పాటుపై తుది నిర్ణయం తీసుకోవాలని చెప్పారు.

పరిపాలనా విభాగాల ఏర్పాటుకు సంబంధించి సీనియర్ అధికారులు, కలెక్టర్లు, పోలీస్ అధికారులు తమ ప్రతిపాదనలను సమావేశంలో వివరించారు. ఉద్యోగుల పెంపు, తగ్గింపు, సర్దుబాటు, ఆయా శాఖల పనిభారం ఆధారంగా నిర్ణయించాలన్నారు. అధికార యంత్రాంగం సమర్ధంగా పనిచేయడం, ప్రజలకు పాలన చేరువ చేయడం, శాంతి భద్రతల పర్యవేక్షణ తదితర విషయాల్లో మరింత బాగా సేవలందించడానికి అనుగుణమైన వాతావరణం కల్పించాలన్నారు. జిల్లా కలెక్టర్లు ప్రతీ కుటుంబంపై అవగాహన కలిగి వుండడం, పేదలకు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడం, క్షేత్ర స్థాయిలో స్వయంగా పనులు పర్యవేక్షించడం చిన్న పరిపాలనా విభాగాల ఏర్పాటు లక్ష్యమన్నారు. జిల్లా యూనిట్లు చిన్నగా వుంటే ప్రభుత్వ కార్యక్రమాల పర్యవేక్షణ సులువు అవుతుందన్నారు.

ఆయా ప్రాంతాల స్వభావం, సామిజిక పరిస్థితులు, భౌగోళిక పరిస్థితుల ఆధారంగా ప్రభుత్వ శాఖల విభాగాలను ఏర్పాటు చేయాలని సిఎం సూచించారు. ఆదిలాబాద్ లో అంటురోగాలు ఎక్కువ కాబట్టి అక్కడ వైద్య, ఆరోగ్య శాఖను పటిష్టం చేయాలని, ఏజెన్సీ ఏరియా ఎక్కువ వున్న చోట సంక్షేమ అధికారుల నియామకం ఎక్కువ చేయాలని సిఎం వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయాధికారులు ఎక్కువ

అవసరం అని సిఎం అన్నారు. దీనిని బట్టి కొత్త ఉద్యోగులను నియమించాలని సిఎం అధికారులను ఆదేశించారు.

“పరిపాలనా విభాగాల కూర్పు సందర్భంగా క్షేత్రస్థాయిలో పనిచేసే ఉద్యోగుల సంఖ్య ఎక్కువగా ఉండేలా చూడాలి. ప్రతీ శాఖలో, ప్రతీ జిల్లాలో సమాన స్థాయిలో ఉద్యోగులు ఉండనక్కరలేదు. జిల్లాల్లో ఆయా శాఖల పనిభారాన్ని బట్టే ఉద్యోగులుండాలి. ఖమ్మం జిల్లాలో సెరికల్చర్ వుంది కాబట్టి అక్కడి సెరికల్చర్ అధికారులుండాలి. రంగారెడ్డి జిల్లాలో హార్టికల్చర్ ఉంది కాబట్టి అక్కడ ఆ శాఖ విస్తరించాలి.

హైదరాబాద్ చుట్టుపక్కల పరిశ్రమలు ఎక్కువ వున్నందున ఆ శాఖ మరింత బాగా పని చేయాలి. ఇలా ప్రతీ శాఖ తమకు ఎక్కువ పనిభారం ఎక్కడ ఉందో గమనించి ఉద్యోగులను సర్దుబాటు చేసుకోవాలి” అని ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు అన్నారు.

ప్రస్తుతం ప్రభుత్వంలో 64 ప్రభుత్వ శాఖలున్నాయి వాటిలో చాలా శాఖలు ఒకే స్వభావం కలిగినవి. అలాంటి వాటిని ఒకే అధికారి పరిధి కిందికి తేవాలని గతంలో ముఖ్యమంత్రి ఆదేశించారు. దానికి అనుగుణంగా అధికారుల టాస్క్ ఫోర్స్ ప్రతిపాదనలు సిద్ధం చేసింది.

మధ్యతరహా, చిన్నతరహా నీటిపారుదల శాఖకు ఒకే జిల్లా అధికారి వుంటారు. వ్యవసాయం, హార్టికల్చర్, సెరికల్చర్ లకు కలిపి ఒకే అధికారిని నియమిస్తారు. విద్యాశాఖలో అన్ని విభాగాలకూ ఒకే అధికారి ఉంటారు. అటవీ శాఖ, సామాజిక అడవులు, వణ్యప్రాణి విభాగాలను కలిపేస్తారు. డి.ఆర్.డి.ఎ, డ్వామా, సెర్ప్ లాంటివన్నీ ఒకే శాఖగా మారతాయి. సంక్షేమ శాఖలు ఒకే గొడుగు కిందికి వస్తాయి. భారీ నీటి పారుదల శాఖ పరిపాలనా విభాగం మాత్రం జిల్లా యూనిట్ గా కాకుండా ప్రాజెక్టుల వారీగా వుంటుంది.

“చిన్న జిల్లాల ఏర్పాటు వల్ల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు, పర్యవేక్షణ సులభంగా వుంటుంది, దీని వల్ల ప్రజలకు మేలు జరుగుతుంది. అవినీతి, అక్రమాలను తగ్గించవచ్చు. ప్రభుత్వం, అధికారులు

తలచుకుంటే ఏమైనా చేయగలరు. పేకాట, గుడుంబా లాంటివి బాగా అరికట్టగలిగాం. మిగతా వాటినీ అలాగే నియంత్రించగలుగుతాం" అని సిఎం చెప్పారు.

"భారీ నీటి పారుదల ప్రాజెక్టులు పూర్తయితే తెలంగాణ వ్యవసాయం బాగా విస్తరిస్తుంది. మత్స్య పరిశ్రమ అభివృద్ధి చెందుతుంది. ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకుని ఆయా శాఖలను పటిష్టం చేయాలి. మైనారిటీల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నందున, వాటిని అమలు చేసే యంత్రాంగం వుండాలి. అభివృద్ధి, సంక్షేమ కార్యాక్రమాలన్నింటినీ కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షించేలా అధికార వ్యవస్థ వుండాలి. ఎస్సీ, ఎస్టీ, బిసిల కోసం, పేదల జివితాల్లో మార్పు తేవడానికి చేపడుతున్న కార్యక్రమాలు మరింత బాగా అమలు కావడానికి చిన్న జిల్లాలు ఉపయోగపడతాయని నా నమ్మకం" అని సిఎం చెప్పారు. కొత్త జిల్లాల్లో కలెక్టరేట్ ఏర్పాటు కోసం రూ. కోటి చొప్పున, పోలీస్ కార్యాలయాల ఏర్పాటుకు రూ. 50 లక్షల చొప్పున మంజూరు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు.

**సిపిఆర్ఓ టు సిఎం**